క్లుప్తంగా

కొల్లి బాబీని అరెస్ట్ చేయాలి



గుడ్లవల్లేరు: కైకలూరు నియోజకవర్గం దానిగూడెంలో దళిత యువకులపై కత్తులతో దాడి ఘటనను దళిత సంఘాలు వ్యతిరేకించి నిరసించాయి. గుడ్లవల్లేరు సెంటరులో శనివారం స్థానిక దళిత నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ దాడికి ప్రధాన కారకుడైన జనసేన నేత కొల్లి బాబీని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దోషులందరినీ కఠినంగా శిక్షించాలని కోరారు. దోషులకు కొమ్ము కాసే పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. అనంతరం దానిగూడెం వెళ్లి బాధితులను పరామర్శించి, సంఘీభావం తెలిపారు.

అన్నసమారాధన



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

16న హుండీ కానుకల లెక్కింపు

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరంలోని శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు. దేవదాయ శాఖాధికారుల సమక్షంలో ఆలయ మండపంలో హుండీలను తెరచి కానుకల్ని లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

మహిళపై కేసు నమోదు

ముదినేపల్లి రూరల్: తమ స్థలంలోకి గేదె వచ్చిందంటూ ఒక మహిళ మరో మహిళ కంట్లో కారం కొట్టి దాడి చేసిన ఘటనకు సంబంధించి శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని కాకరవాడకు చెందిన గుత్తా పద్మకుమారికి చెందిన గేదె సమీపంలోని సుంకర సత్యవతి ఇంటి ఆవరణలోకి వెళ్లింది. దీంతో సత్యవతి పద్మకుమారిని దూషిస్తుండగా ఎందుకు దూషిస్తున్నావని పద్మకుమారి ప్రశ్నించింది. దీంతో పద్మకుమారి కంట్లో కారం కొట్టడంతో పాటు కర్రతో దాడి చేసింది. దీంతో పద్మకుమారిని చికిత్స కుమారిని బంధువులు గుడివాడ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సత్కారం



గుడ్లవల్లేరు: గవర్నమెంట్ మోడల్ ప్రైమరీ స్కూల్ గుడ్లవల్లేరు-2లో పనిచేస్తున్న ఏవీ వరలక్ష్మి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారం సాధించారు. దీంతో ఆమెను శనివారం పాఠశాల్లో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.నాగేశ్వరమ్మ, ఉపాధ్యాయులు వై.నాగలక్ష్మి, లక్ష్మీకుమారి, సీఆర్పీ ఉమారాణి పాల్గొన్నారు.

దాడిపై విచారణ

కైకలూరు: దానిగూడెం దళితులపై జనసేన కార్యకర్తలు దాడి చేశారనే అభియోగాలపై జనసేన అధిష్ఠానం ఆదేశాలతో రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ విజయవాడ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు దానిగూడెం దళితులతో శనివారం మాట్లాడారు. జనసేనకు చెందిన ప్రధాన సూత్రధారిని అరెస్టు చేయలేదని దానిగూడెం ప్రజలు, దళిత సంఘాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో అప్పలనాయుడు బాధిత దళిత కుటుంబాలతో జరిగిన ఘటనపై మాట్లాడారు. వారి వద్ద ఉన్న దాడి వీడియోలను ఆయనకు చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తప్పు చేశారని తేలితే పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

29 వరకు రైల్వే గేటు మూసివేత

కైకలూరు: రైల్వే ట్రాక్ అత్యవసర మరమ్మతుల నిమిత్తం కైకలూరు–ఆకివీడు రైల్వే రూటులో లెవల్ క్రాసింగ్ గేటు నంబరు 86 (వదర్లపాడు రైల్వేగేటు)ను మూసివేయనున్నారు. ఈ నెల 15 ఉదయం 7 గంటల నుంచి 29వ తేదీ రాత్రి 7 గంటల వరకూ మూసివేస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే, కైకలూరు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఎండీ.అబ్దుల్ రహమాన్ శనివారం తెలిపారు. భుజబలపట్నం బ్రాంచ్ నుంచి వదర్లపాడు, శీతనపల్లి వెళ్లే వాహనదారులు, పాదచారులు ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు.

కేసులు రాజీ చేసుకోవడమే రాజమార్గం



కైకలూరు కోర్టులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్వీ లక్ష్మి

కైకలూరు: కోర్టు కేసులకు సంబంధించి రాజీ చేసుకోవడమే రాజమార్గమని కైకలూరు కోర్టు సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు వీవీఎస్వీ.లక్ష్మి, ఎం.శివకిరణ్ పేర్కొన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఇరువురు జడ్జిలు పీఎల్, ఎక్సైజ్, ఎన్ఐ యాక్టు, మనోవర్తి, చెక్ బౌన్స్ వంటి 263 కేసులను పరిష్కరించారు. వివిధ కేసుల ద్వారా కక్షిదారుల నుంచి పరిష్కార సొమ్ము రూ.45,46,313 రాబట్టారు. ఈ సందర్భంగా జడ్జిలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్నచిన్న సమస్యలకు కేసులు నమోదు చేసుకోవడంతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకుంటున్నారన్నారు. రాజీ మార్గమే మంచిదన్నారు. లోక్ అదాలత్‌లో తీర్పు సుప్రీంకోర్టులో ఇచ్చిన తీర్పుతో సమానమన్నారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్, న్యాయవాదులు పిచ్చికల పవన్‌కాంత్, బోడావుల ఇందిరా, తెలగంశెట్టి శ్రీనివాసరావు, అగ్నిహోత్రం ఆత్రేయబాబు, అడ్డగర్ల రాంబాబు, పత్తే ప్రసన్నకుమార్, రమాదేవి, శివప్రసాద్, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కక్షిదారులు ముందుకు రావాలి

గుడివాడ టౌన్: రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకునేందుకు కక్షిదారులు ముందుకు రావాలని 11వ అదనపు జిల్లా జడ్జి జి. సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం స్థానిక కోర్టు హాల్లో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవా సంస్థ ఉత్తర్వుల మేరకు లోక్ అదాలత్ నిర్వహించామన్నారు. మొత్తం నాలుగు బెంచీలు ఏర్పాటు చేశామని అధిక సంఖ్యలో కేసుల పరిష్కారం అయ్యాయన్నారు. ఈ అదాలత్‌లో సివిల్–13, క్రిమినల్–2,598, ఇతర కేసులు–8, మొత్తం 2,619 కేసులు పరిష్కరించామని వీటి విలువ రూ. 1,58,03,636 గా నిర్ణయించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్. వాసుదేవ్, జూనియర్ సివిల్ జడ్జి పి. గాయత్రి, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి. అరుంధతి, బ్యాంక్ అధికారులు, పోలీస్ అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



కేసు పరిష్కార ఉత్తర్వులను కక్షిదారులకు అందజేస్తున్న ఏడీజే సుబ్రహ్మణ్యం

346 కేసుల పరిష్కారం

మొవ్వ: మొవ్వ న్యాయస్థానంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 346 కేసులకు పరిష్కారం లభించింది. మొవ్వ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ స్వర్ణలత వల్గా మార్కు ఆధ్వర్యంలో జరిగిన ఈ అదాలత్ ద్వారా పలు కేసులకు రూ.1,56,800 అపరాధ రుసుం విధించినట్లు న్యాయస్థాన సిబ్బంది తెలిపారు. న్యాయస్థాన పరిధిలోని కూచిపూడి, ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి పోలీస్‌స్టేషన్ ఆఫీసర్లు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.



మొవ్వలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి స్వర్ణలత

సైలెన్సర్‌తో హల్‌చల్ చేస్తే సహించం



కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడ టౌన్: పట్టణంలో ద్విచక్ర వాహనదారులు సైలెన్సర్లతో హల్‌చల్ చేస్తే సహించేది లేదని డీఎస్పీ ధీరజ్ వినీల్ అన్నారు. శనివారం ద్విచక్ర వాహనాలతో హల్‌చల్ చేసే ఏడుగురిని అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఈ విధమైన శబ్ద కాలుష్య కార్యక్రమాలు అధికమయ్యాయన్నారు. దీని వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలగటంతో పాటు ఇతర వాహనాలకు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

ఓల్డేజ్ హోమ్‌లు, ఆస్పత్రులు, ఇతర నిషేధిత ప్రాంతాల్లో వీరి చేష్టలు ఇబ్బందికరంగా మారాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న సైలెన్సర్లను తొలగించి శబ్దం రాని సైలెన్సర్లు ఏర్పాటు చేశామన్నారు. ఇది తొలి అపరాధంగా గుర్తించి తక్కువ జరిమానా విధించామన్నారు. ఇకపై ఈ విధమైన కార్యక్రమాలకు పాల్పడే ఎవరినైనా విడిచిపెట్టేదిలేదని రూ.10 వేలు జరిమానా కేసులు సైతం ఉంటాయని హెచ్చరించారు. పట్టణంలోని యువత ఈ విషయాన్ని గమనించి మసలుకోవాలని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ పి. నాగరాజు, ఏఎస్ఐ శంకరరావు పాల్గొన్నారు.

ఉరుములు మెరుపులతో భారీ వర్షం



పామర్రులో కురిసిన వర్షం



ముదినేపల్లి మెయిన్‌రోడ్డులో నిలిచిన వర్షపునీరు

పామర్రు: పామర్రులో శనివారం ఉరుములు మెరుపులతోకూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు ఏక ధాటిగా వర్షం కురవడంతో రహదార్లు జలమయంగా మారాయి. పల్లపు ప్రాంతాలు వర్షపునీటితో నిండిపోయాయి. వర్షం రాకతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక అరండాల్‌పేట, బాపూజీ పేట, గాంధీనగరం తదితర ప్రాంతాల్లోని అంతర్గత రహదార్లు వర్షపు నీటితో నిండిపోవడంతో రాక పోకలకు స్థానికులు అవస్థలు ఎదుర్కొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పాదాచారులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు. కాగా వరిని ఆశించే ఆకు నల్లి వర్షంతో కనుమరుగవుతుందని ఏఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: అల్పపీడనం ప్రభావంతో మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామాల్లో అంతర్గత రహదారులన్నీ జలమయమయ్యాయి. ముదినేపల్లి మెయిన్‌రోడ్డు, అంబేడ్కర్ నగర్ కాలనీలో వర్షపునీరు నిలిచిపోయింది. వర్షం వల్ల వరి చేలకు ఎంతోకొంత మేలు జరిగే అవకాశం ఉందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



మండవల్లిలో వర్షంతో రోడ్డుపై నిలిచిన నీరు

బాలల ఆరోగ్య రక్షణ అందరి కర్తవ్యం



గన్నవరం రూరల్: బాలల ఆరోగ్యం పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ఆత్కూరు పీహెచ్‌సీ డాక్టర్ జితేంద్రకుమార్ ఆదేశించారు. రాష్ట్ర బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా తెంపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. నిరంతరం బాలల ఆరోగ్యాన్ని సమీక్షించాలని సిబ్బందికి సూచించారు. పౌష్టికాహారం ఇవ్వాలన్నారు.

హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్త కల్పన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రాజనాల సురేష్

హనుమాన్‌జంక్షన్ రూరల్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15వ తేదీన విజయవాడలోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనాల సురేష్ కోరారు. హనుమాన్‌జంక్షన్‌లోని భవన నిర్మాణ కార్మికుల అడ్డాల వద్ద శనివారం ఉదయం వర్కర్లకు కరపత్రాలను పంపిణీ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు గతంలో మాదిరిగా ప్రమాద బీమా, మహిళా కూలీలకు వివాహ, ప్రసవ సమయాల్లో ఆర్థికసాయం, పిల్లల చదువులకు ఉపకార వేతనాలు అందించాలన్నారు. ఈ నెల 15న భవన నిర్మాణ కార్మికులంతా పనులు నిలుపుదల చేయాలని, లేబర్ కమిషనర్ ఎదుట మహాధర్నాకు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సూరిబాబు పాల్గొన్నారు.

సమైక్యంగా సేవలందించాలి

ముదినేపల్లి రూరల్: యువకులంతా సమైక్యంగా సేవా కార్యకలాపాల్లో పాల్గొనాలని ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. మండలంలోని పెయ్యేరు వైఎస్సార్ కాలనీలో ఏర్పాటుచేసిన 'మేము సైతం టీం' నిర్వాహకుడు మొవ్వ ఫణీంద్ర నివాసంలో టీం సభ్యులను విక్టర్ ప్రసాద్ శనివారం కలిశారు. ఈ సందర్భంగా పేదలు, వృద్ధులకు చేస్తున్న సాయాన్ని టీం సభ్యులు వివరించారు. భూపతి రవీంద్ర, బందుల విజయసాగర్, ధర్మరాజు, ప్రకాష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

భార్యపై భర్త చాకుతో దాడి



నందివాడ: మండలంలోని పోలాశివారిపాలెం గ్రామానికి చెందిన సాలి సాయిబాబు అతని భార్య దివ్యపై చాకుతో దాడి చేశాడు. పోలీసుల కథనం మేరకు సాయిబాబు, దివ్య మధ్య కుటుంబ గొడవల నేపథ్యంలో ఆమె కుదరవల్లి గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. దీంతో సాయిబాబు శుక్రవారం తెల్లవారుజామున దివ్య పుట్టింటికి వచ్చాడు. తన భార్యను తనతో పాటు వచ్చేయమని అడిగాడు. ఆమె నిరాకరించడంతో సాయిబాబు తన వెంట తెచ్చుకున్న చాకుతో భార్య దివ్యతోపాటు అత్తమామలైన లంకపల్లి రత్నకుమారి, లంకపల్లి నీలాంబరంపై దాడి చేశాడు. దివ్య గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంది. ఈ సమయంలో ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా నందివాడ ఎస్ఐ కె. శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సాయం

కైకలూరు: తెలంగాణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులకు ఏలూరు రూరల్ మండలానికి చెందిన కొల్లేరు వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు మోరు రామరాజు ఆయన కుమారుడు అజయ్‌భగవాన్ చారిటబుల్ ట్రస్టు తరపున నగదు సాయాన్ని కైకలూరు మండలం గుమ్మళ్లపాడులో శనివారం అందించారు. తెలంగాణ రాష్ట్రం జనగామ మండలం శామీర్‌పేట్ బైపాస్ వద్ద కైకలూరు మండలం గుమ్మళ్లపాడుకు చెందిన 20 మందితో చేపల పట్టుబడికి వెళ్లిన కూలీల వాహనం ఈ నెల 7న బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సైదు హరిశ్చంద్ర మృతి చెందాడు. మిగిలిన వారికి గాయాలయ్యాయి.

దాడి ఘటనపై కేసు నమోదు

గుడివాడటౌన్: ఆటో, వ్యాన్ డ్రైవర్ల మధ్య చెలరేగిన వివాదం ఘర్షణకు దారితీసింది. గుడివాడ రూరల్ మండలం లింగవరం గ్రామానికి చెందిన వల్లూరి రత్తయ్య, వల్లూరి నాగరాజులు శనివారం రాత్రి ఆటోలో లింగవరం వైపు వెళుతున్నారు. అదే సమయంలో లింగవరానికి చెందిన వ్యక్తులు భారత్ గ్యాస్ వ్యాన్ నడుపుతూ రత్తయ్య ఆటోకు అడ్డుగా పెట్టారు. వ్యాన్ వెనక్కు వెళ్లాలని కోరగా.. నీవే వెళ్లాలని వారు అడ్డుగా నిలిచిపోయారు. దీనిపై పరస్పరం వాదించుకుంటున్న సమయంలో వ్యాన్‌లోని వారికి మద్దతుగా మరో నలుగురు వచ్చి రత్తయ్య, నాగరాజును దూషిస్తూ దాడికి తెగబడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంటిబాబు చెప్పారు.

యూట్యూబ్ చానల్స్ విలేకరులపై కేసు

గన్నవరం: బియ్యం వ్యాపారులను బెదిరించిన ఇరువురు యూట్యూబ్ చానల్స్ విలేకరులపై గన్నవరం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు కథనం మేరకు మండలంలోని సూరంపల్లి సమీపంలోని బియ్యం గోదాం వద్దకు ఈ నెల 7న గుంటూరుకు చెందిన యూ ట్యూబ్ చానల్స్ విలేకరులు వెంకటేశ్వరరావు, వంశీ వచ్చారు. ఇక్కడ రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారని, తమకు రూ.60 వేలు ఇవ్వాలని గో దాం సిబ్బందిని బెదిరించారు. ఈ ఘటనపై గోదాం సిబ్బంది నరేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వెంకటేశ్వరరావు, వంశీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళలకూ యూరియా కష్టాలు

కూటమి ప్రభుత్వంలో తప్పని తిప్పలు



పెదపారుపూడిలో యూరియా కోసం చంటిబిడ్డను ఎత్తుకుని క్యూలో నిలబడిన మహిళ

పెదపారుపూడి: పెదపారుపూడిలో యూరియా కష్టాలు మహిళలకూ తప్పడం లేదు. పెదపారుపూడి పీఏసీఎస్‌కు 20 టన్నుల యూరియా శుక్రవారం వచ్చింది. దీంతో శనివారం ఉదయం ఆరు గంటల నుంచి రైతులు వచ్చి సొసైటీ గేటు ముందు నిలుచున్నారు. సిబ్బంది వచ్చిన తరువాత పట్టాదారు పుస్తకాల జెరాక్స్ కాపీలను తీసుకెళ్లారు. ఉదయం ఏడు గంటలకు యూరియా కోసం మహిళలు సైతం వచ్చి క్యూలో బారులు తీరారు. 'కూటమి ప్రభుత్వంలో ఇవేమి కష్టాలు రా బాబూ' అంటూ వారు వాపోతున్నారు.

చంటి పిల్లాడిని ఎత్తుకుని..

పీఏసీఎస్ వద్ద యూరియా కోసం చంటి పల్లాడిని ఎత్తుకుని ఒక మహిళ క్యూలో నిలుచుంది. గంటల కొద్దీ క్యూలో ఉండడంతో జ్వరంతో బాధపడుతున్న తన పిల్లవాడు ఏడుస్తుండడంతో ఇబ్బంది పడుతూనే నిలుచుంది. 10 ఎకాల పొలం సాగు చేస్తుంటే కష్టపడి క్యూలో నిలుచున్నా రెండు బస్తాలు మాత్రమే ఇస్తామని రాసిచ్చారని ఈదులమద్దాలి గ్రామానికి చెందిన బత్తిన స్టెల్లి వాపోయింది.

యూరియా సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం

పెదపారుపూడి: రైతులకు యూరియా అందించటంతో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. పెదపారుపూడి పీఏసీఎస్ వద్ద గేటు వద్ద ఉన్న రైతులతో శనివారం ఆయన చర్చించారు. రైతుల కష్టాలను తెలుసుకున్న అనంతరం ఎంపీపీ మాట్లాడారు. యూరియా కోసం రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సొసైటీ ద్వారా పట్టాదారు పుస్తకాల జెరాక్స్ కాపీలు తీసుకుని ఒకటి, రెండు బస్తాలు ఇస్తే 10 ఎకరాలు పొలం సాగు చేసే రైతులకు ఏమి సరిపోతుందని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో యూరియా కోసం రైతులను ఏనాడూ ఇబ్బంది పడలేదన్నారు.



రైతులతో మాట్లాడుతూ ఎంపీపీ గోగం సురేష్

శ్రీ కొండలమ్మ ఆలయ చైర్మన్‌గా మోహన్

17న ధర్మకర్తల మండలితో ప్రమాణ స్వీకారం



నూతన చైర్మన్ ఈడె మోహన్

గుడ్లవల్లేరు: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు వీర విధేయుడికే శ్రీ కొండలమ్మ ఆలయ చైర్మన్ పదవి దక్కింది. ఈ విషయమై శనివారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. గత నెల ఈ ఆలయ ధర్మకర్తల మండలి కోసం నోటిఫికేషన్‌ను అధికారులు విడుదల చేశారు. మండలంలోని కట్టవానిచెరువు శివారు చింతలగుంటకు చెందిన ఈడె వెంకట విష్ణుమోహన్‌రావు(మోహన్)కే ఈ ఆలయ చైర్మన్ గిరీ దక్కుతుందని తెలుగు తమ్ముళ్లలో చర్చలు ఊపందుకున్నాయి. ఈ విషయమై అప్పట్లోనే 'సాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. అనేక భిన్న వాదనల నడుమ చివరకు ఎమ్మెల్యే రాము వీర విధేయుడికే చైర్మన్ ఇస్తారన్న వాదనలు నిజమయ్యాయి. ఈ నెల 17న తొమ్మిది మంది ధర్మకర్తల మండలితో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకారానికి ప్రత్యేక అధికారిని కూడా నియమించారు.

రూ.2కోట్ల వార్షికాదాయం

కృష్ణా జిల్లాలోనే శక్తి ఆలయాల్లో దేవదాయ లెక్కల ప్రకారం ఆదాయంలో ప్రాధాన్యతతో ఈ ఆలయం నమోదు కాబడింది. 2005లో ఈ ఆలయాన్ని దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. తొలి చైర్మన్‌గా తాళ్లూరి మాధవ్, మేనేజర్‌గా జక్కా ధర్మారాయుడిని అప్పటి ప్రభుత్వం నియమించింది. భక్తుల నుంచి ఏడాదికి దాదాపు ఒక రూ.2కోట్లు కానుకల రూపంలో ఆదాయం వస్తుంది.

దేవస్థాన ధర్మకర్తల మండలి నియామకం

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానానికి దేవదాయ ధర్మదాయ కమిషనర్ గొల్లపూడి వారి ఉత్తర్వుల ప్రకారం నూతన ధర్మకర్తల మండలి నియామక ఉత్తర్వులు శనివారం జారీ అయ్యాయి. చైర్మన్‌గా ఈడె వెంకట విష్ణు మోహన్‌రావు(మోహన్), ధర్మకర్తలుగా తూము రాజ్యలక్ష్మి, గుడ్లవల్లేటి వాణి, ముంగం అంజనేయులు, కోళ్లపల్లి సుగుణ శేఖర్, మన్నెం వీర నాగేంద్రరావు, వడ్లమూడి రవీంద్రబాబు, పెద్దిబోయిన శ్యామలాదేవి, నూతులపాటి లక్ష్మీ పావనిని నియమించినట్లుగా ఆదేశాలు వచ్చాయి.

శ్మశానానికి దారి లేక అవస్థలు



ఆనందపురంలో ముళ్లచెట్లతో నిండి ఉన్న శ్మశానం దారి

మండవల్లి: మండలంలోని మూడుతాళ్లపాడు శివారు ఆనందపురంలో శ్మశానానికి దారి లేక గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. శ్మశానానికి వెళ్లే దారిలో ముళ్ల పొదలు ఉండడంతో ఇబ్బంది పడుతున్నారు. మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లే వీలులేక పక్కనున్న చేపల చెరువు గట్టు వైపు నుంచి వెళ్తుంటే చెరువు యజమాని అభ్యంతరం చెబుతున్నట్లు పలువురు పేర్కొన్నారు. వర్షం పడితే మరిన్ని సమస్యలు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు చేపట్టి మృతదేహం శ్మశానం వరకు చేరేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా గణనాథుడి ఊరేగింపు



కైకలూరులో వినాయకుడి ఊరేగింపు

కైకలూరు: స్థానిక కూరగాయలు, పండ్ల వర్తక సంఘం 51వ వార్షిక ఆదివినాయక చవితి వేడుకల్లో భాగంగా స్వామి విగ్రహాన్ని పురవీధుల్లో శనివారం ఘనంగా ఊరేగించారు. అడవి నాయుడు సెంటర్ నుంచి మాగంటి థియేటర్, ఏలూరు రోడ్, కోరుకొల్లు రోడ్ ఇలా పలు వీధుల్లో విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు స్వామిని దర్శించుకుని ప్రసాదాలు అందుకున్నారు. ఊరేగింపు సందర్భంగా శక్తివేషాలు, కోయ డ్యాన్సులు, గరక డప్పులు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కమిటీ సభ్యులు గుగ్గిలపు చిన్నా, రామకృష్ణ, ప్రసాద్, కొండేటి వెంకన్న, పంజా రాంబాబు, ఏసు, గణేష్ పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కరించాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

గన్నవరం: స్థానిక ఎస్సీ ఏరియాలో డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ శనివారం కాలనీవాసులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళి మాట్లాడుతూ కాలనీలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ సమస్యతో మురుగునీటి పారుదల సక్రమంగా జరగడం లేదన్నారు. మురుగునీరు ఎక్కడికక్కడ స్తంభించిపోతోందన్నారు. రోజుల తరబడి రోడ్లపై మురుగునీరు నిలిచి ఉండడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తి పరిసర ప్రాంత ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు.